## క్లుప్తంగా

### నేడు కడియాలమ్మ జాతర

**కడియం:** కడియంలోని కడియాలమ్మ జాతర, తీర్థ మహోత్సవం ఆదివారం, సోమవారాల్లో జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు.

### పోలేరమ్మకు స్వీట్ల సారె

**కడియం:** దుళ్ల గ్రామంలో కొలువైన పోలేరమ్మకు శనివారం భక్తులు వివిధ రకాల స్వీట్లతో సారె సమర్పించారు. ముందుగా మంగళ వాయిద్యాలు, గరగ నృత్యాల నడుమ మహిళలు సారెతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అమ్మవారికి సమర్పించి, ప్రత్యేక పూజలు జరిపారు.

### ఉపాధ్యాయుల శ్రమదానం



నీరు బయటకు పోయేందుకు మార్గం తవ్వుతున్న ఉపాధ్యాయులు

**కడియం:** స్థానిక ఏవీఆర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం శ్రమదానం చేశారు. విడవకుండా కురుస్తున్న వర్షాల కారణంగా పాఠశాల మైదానంలో నీరు నిలిచిపోయింది. రాకపోకలకు సైతం ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో గ్రీన్ కోర్ ఉపాధ్యాయుడు గొల్లపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు జీవీ నాగమణి, బి.సువర్ణవేణి, కె.రాజు, ఎం.డేవిడ్, జి.శరత్‌బాబు, లీలావతి, వీర రాఘవకుమారి, వీర బాబు తదితరులు ముంపు నీరు బయటకు పోయేందుకు మార్గం ఏర్పాటు చేశారు.

### మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కటకటాలే



తులసీధర్, ఇన్‌స్పెక్టర్

**కడియం:** బాలికలు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తిస్తే కటకటాలు లెక్కపెట్టాల్సి వస్తుందని కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ హెచ్చరించారు. ఈ మేరకు శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కడియం గ్రామానికి చెందిన ఓ వివాహితతో అదే గ్రామానికి చెందిన చల్లా కొండరాజు అసభ్యంగా ప్రవర్తించడమే కాకుండా, ఆమె భర్తపై దాడి చేసి గాయపరిచాడని తమకు ఫిర్యాదు అందిందన్నారు. ఎస్సై బి.నాగదుర్గాప్రసాద్ కేసు నమోదు చేసి నిందితుడు కొండరాజును అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పర్చగా, రిమాండు విధించిందని వివరించారు. చెడు వ్యసనాలకు బానిసలుగా మారిన కొంతమంది మోటార్ బైకులపై గ్రామాల్లో ఇష్టానుసారంగా తిరుగుతూ ప్రజలను, ముఖ్యంగా బాలికలను ఇబ్బంది పెడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇప్పటికే పలు స్కూళ్ల వద్ద కానిస్టేబుళ్లను ఏర్పాటు చేశామన్నారు.

### రెయిన్ కోట్‌ల పంపిణీ



పంచాయతీ కార్మికులకు రెయిన్ కోట్‌లు పంపిణీ చేస్తున్న బొప్పన సుబ్బారావు

**రాజమహేంద్రవరం రూరల్:** పిడింగొయ్యి పంచాయతీలోని కార్మికులకు వైఎస్సార్ సీపీ నాయకుడు, హుకుంపేట సొసైటీ మాజీ అధ్యక్షుడు బొప్పన సుబ్బారావు శనివారం రెయిన్ కోట్‌లు పంపిణీ చేశారు. వర్షాలలో పని చేసే కార్మికులు ఇబ్బంది పడకుండా ఉండాలన్న ఉద్దేశంతో వీటిని అందజేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుందరపల్లి అనిల్, దాసరి శివకుమార్, అమలావరపు చిన్నారావు, బొప్పన ప్రసాద్, సిరసపల్లి శంకర్రావు పాల్గొన్నారు.

### మద్యం తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు

**కడియం:** మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ తులసీధర్ తెలిపారు. స్టేషన్ పరిధిలో పది మందిని డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో అరెస్టు చేసి కోర్టు ముందు హాజరు పరిచామన్నారు. వారికి జరిమానా విధించారన్నారు. మద్యం తాగి వాహనం నడిపితే మూడు వేల రూపాయల వరకు జరిమానా విధించేందుకు అవకాశం ఉంటుందని, వాహనదారులు ఈ విషయాన్ని గమనించుకోవాలని ఆయన కోరారు.

### పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

**కడియం:** మండలంలోని వేమగిరి జగనన్న కాలనీ సమీపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేశామని పోలీస్ ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్ తెలిపారు. వారి నుంచి రూ.2100 స్వాధీనం చేసుకున్నామన్నారు.



# పొంచి ఉన్న ముంపు గండం

- గోదావరికి పెరుగుతున్న వరద
- ధవళేశ్వరంలో స్లూయిజ్ వద్ద నీరు వెనక్కు వచ్చే అవకాశం
- అదే జరిగితే బాలాజీపేట, హుకుంపేట ప్రాంతాలకు ముంపు ముప్పు



ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద గోదావరిలో కలిసే మురుగునీటి కాలువ

**ధవళేశ్వరం:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు ప్రజలను బెంబేలెత్తిస్తున్నాయి. వర్షాల కారణంగా గోదావరికి వరద ఉధృతి బాగా పెరిగింది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా నీరు వచ్చి గోదావరిలో కలుస్తోంది. గోదావరిలో నీరు పెరిగిన నేపథ్యంలో ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద నీరు వెనక్కు వచ్చే ప్రమాదం ఉంది. అదే జరిగే బాలాజీపేట, హుకుంపేట తదితర ప్రాంతాలు ముంపు బారిన పడతాయి.

**గతంలో ఇదే పరిస్థితి**

గతంలో వరద సమయంలో ఇదే పరిస్థితి ఎదురైంది. అప్పుడు పడవలపై ముంపు ప్రాంతాలకు వెళ్లి అధికార యంత్రాంగం సేవలందించింది. ప్రస్తుతం అదే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అధికార యంత్రాంగం ముందుగా దృష్టి సారించి ధవళేశ్వరం సాయిబాబా గుడి వద్ద ఉన్న స్లూయిజ్ వద్ద తక్షణమే లిఫ్టింగ్ పంపులను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**లోతట్టు ప్రాంతాలకు వరద భయం**

రాజమహేంద్రవరంలోని మురుగునీరంతా నేతాజీ నగర్ మీదుగా ధవళేశ్వరం సాయిబాబా గుడి దగ్గర ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద గోదావరిలో కలుస్తుంది. గోదావరికి 10 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చిన సమయంలో అవుట్‌ఫాల్ స్లూయిజ్ గేట్లను మూసివేస్తారు. వరదల సమయంలో నీరు ఇక్కడ వెనక్కు తన్నడంతో లోతట్టు ప్రాంతాలు ముంపు బారిన పడతాయి. ప్రస్తుతం గోదావరి వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. దీంతో లోతట్టు ప్రాంత వాసులు భయాందోళనకు గురవుతున్నారు.

**భారీగా వరద నీరు**

గోదావరి పరీవాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల్లో నీటి మట్టాలు భారీగా పెరుగుతున్నాయి. దీంతో కాటన్ బ్యారేజ్‌కు భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. మరో రెండు రోజుల్లో గోదావరి ఉగ్ర రూపం దాల్చే అవకాశం ఉంది. ముంపు బారిన పడిన తరువాత చర్యలు చేపట్టే కంటే ముందుగానే ఏర్పాట్లు చేస్తే ఇబ్బందులు కలుగకుండా ఉంటాయని పలువురు పేర్కొంటున్నారు. గతంలో సాయిబాబా గుడి వద్ద ఉన్న అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద పెద్ద పెద్ద పంపులను ఏర్పాటు చేసి నీటిని గోదావరిలోకి లిఫ్ట్ చేశారు.

**భయాందోళనలో ప్రజలు**

రాజమహేంద్రవరం మురుగునీరు గోదావరిలో కలిసే అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద నీరు వెనక్కు వస్తే బాలాజీపేట, హుకుంపేట తదితర ప్రాంతాలకు ముంపునకు గురవుతాయి. దీంతో వరదలు వస్తున్నాయంటే ఈ ప్రాంత వాసులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే అవుట్‌ఫాల్ స్లూయిజ్ వద్ద పంపులు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## జలదిగ్బంధంలోనే ములకల్లంక

- కొనసాగుతున్న వరద ఉధృతి
- మర పడవలపై రాకపోకలు
- బోట్లు ఏర్పాటు చేయాలని కోరుతున్న ప్రజలు



బొబ్బిల్లంక - ములకల్లంక మధ్య మరపడవపై ప్రయాణిస్తున్న ప్రజలు

**సీతానగరం:** గోదావరి వరద ఉధృతి నేపథ్యంలో ములకల్లంక గ్రామం జలదిగ్బంధం నుంచి బయటపడలేదు. నది మధ్యలో ఉన్న ఈ గ్రామానికి వెళ్లే రోడ్డు ముంపు బారిన పడడంతో ప్రజలు మరపడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. అయితే వరద చాలా ఎక్కువగా ఉన్న కారణంగా మర పడవలపై ప్రయాణం సురక్షితం కాదు. ఈ నేపథ్యంలో బొబ్బిల్లంక - ములకల్లంక గ్రామాల మధ్య రాకపోకలకు బోట్లు, లాంచీలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం సమయంలో అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గోదావరి వరద వచ్చిన వెంటనే బోట్లను ఏర్పాటు చేసేవారు. వాటిపై ప్రజలు సురక్షితంగా ప్రయాణం సాగించేవారు. అయితే ఇప్పుడు వరద వచ్చి నాలుగు రోజులవుతున్నా బోట్లను ఏర్పాటు చేయలేదు.

**నిరంతర పర్యవేక్షణ**

మలకల్లంకలోని పరిస్థితిని నియోజకవర్గం స్పెషల్ ఆఫీసర్ సాయిబాబా ఎప్పటి ఎప్పుడు తెలుసుకుంటున్నారు. మండల స్పెషల్ ఆఫీసర్ రామ్ ప్రసాద్, ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, తహసీల్దార్ నెల్సన్ పాల్‌బాబు, ఈవోపీఆర్డీ మూర్తి, పంచాయతీ కార్యదర్శి రజాక్, వీఆర్వో నాగమణి, వైద్య ఆరోగ్యశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. పంచాయతీ ఆధ్వర్యంలో ములకల్లంకలో పారిశుధ్య కార్యక్రమాలు చురుగ్గా జరుగుతున్నాయి. గ్రామంలోని అన్నిచోట్ల బ్లీచింగ్ చల్లుతున్నారు. తాగునీటికి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో రెండేళ్ల క్రితం ఆ గ్రామంలో టవర్లు ఏర్పాటు చేయడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగలేదు. వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో బొబ్బిల్లంక, ములకల్లంక గ్రామాలలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కుక్కకాటు, పాము కాటు వ్యాక్సిన్లు, మందులు సిద్ధంగా ఉంచారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్నారు. వైద్యులు ఏవీకే చైతన్య, ఎస్.రాజు, మేఘన, ఏసురాణి పర్యవేక్షిస్తున్నారు. గోదావరి వరద బాగా పెరిగితే ములకల్లంక వాసులకు బొబ్బిల్లంకలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.

## ఆక్యుప్రెజర్ థెరపీ శిబిరం ప్రారంభం



శిబిరంలో ఆక్యుప్రెజర్ థెరపీ నిర్వహిస్తున్న దృశ్యం

**రాజమహేంద్రవరం సిటీ:** శారీరక, మానసిక ఆరోగ్యానికి ఆక్యుప్రెజర్ థెరఫీ ఎంతో ఉపయోగపడుతుందని రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ పూర్వపు అధ్యక్షుడు కంతమని కాశీ విశ్వేశ్వరరావు అన్నారు. రివర్ సిటీ ఆధ్వర్యంలో ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాల్‌లో ఆరు రోజుల పాటు నిర్వహించే ఆక్యుప్రెజర్ థెరపీ వైద్య శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రివర్ సిటీ అధ్యక్షుడు నాళం నరసింహారావు మాట్లాడుతూ జూలై 25 వరకూ ఉదయం 8 నుంచి 12 వరకూ, సాయంత్రం 4 నుంచి 8 గంటల శిబిరం జరుగుతుందన్నారు. రాజస్థాన్‌కు చెందిన తాన్రాజ్ చౌదరి, రేవంత్ చౌదరి సేవలందిస్తున్నారన్నారు. ప్రతి రోజూ 200 మందికి ఈ వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కనకం చంద్రశేఖరరావు, అసిస్టెంట్ గవర్నర్ దొరబాబు, బచ్చు సత్యానందం, లంకలపల్లి శ్రీనివాసరావు, నాగేంద్ర కిషోర్ పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కళాశాలలో ముగిసిన వర్క్‌షాప్

**ప్రకాశం నగర్:** స్థానిక ఆర్ట్స్ కళాశాలలోని ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అకాడమీలో రాష్ట్ర స్థాయి అటానమస్ కళాశాలల ప్రధానాచార్యులకు, ఇతర ముఖ్య సిబ్బందికి మూడు రోజులుగా జరుగుతున్న వర్క్‌షాప్ శనివారంతో ముగిసింది. కళాశాల విద్యాశాఖ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 26 అటానమస్ కళాశాలలకు చెందిన ప్రధానాచార్యులు, ఐక్యూఏసీ సమన్వయాధికారులు, అకడమిక్ సమన్వయాధికారులు, పరీక్షల నియంత్రణాధికారులు పాల్గొన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర అధ్యక్షత వహించగా, విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల విద్యారంగంలో ఇంటర్నల్ కంటిన్యూవస్ అసెస్మెంట్, ఇంటర్న్‌షిప్ కమ్యూనిటీ సర్వీస్ ప్రాజెక్ట్, జాబ్ పోర్టల్, లెర్నింగ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, స్టూడియోల ఏర్పాటు, ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ అకాడమీ ఏర్పాటు తదితర సంస్కరణలను తీసుకు వచ్చామన్నారు. కార్యక్రమంలో కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ చప్పిడి కృష్ణ, కళాశాల విద్యశాఖకు చెందిన ఆర్జేడీలు పాల్గొన్నారు.


## సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



నల్లమిల్లిలో కూరదోస పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి దివ్యశ్రీ

**రంగంపేట:** అధిక వర్షాల కారణంగా కూరగాయల పంటల్లో తక్షణమే సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల ఉద్యాన శాఖ అధికారి కె.దివ్యశ్రీ సూచించారు. శనివారం మండలంలోని గ్రామాల్లో ఉద్యాన పంటలను ఆమె ఉద్యాన, వ్యవసాయ సహాయకులతో కలసి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలో వంగ, బెండ, చిక్కుడు, మిరప, కాకర, ఆగాకర, బీర, ఆనబ తదితర రకాల కూరగాయలు 50 ఎకరాల్లో సాగు చేస్తున్నారన్నారు. అధిక వర్షాల కారణంగా కూరగాయల పంటలకు తెగుళ్లు సోకే అవకాశం ఉన్నందున రైతులకు నివారణ చర్యలు సూచించామన్నారు. వర్షాలు ఆగిన అనంతరం పొలంలో నీరు లేకుండా చేసి వెంటనే కలుపు తీయాలని, ఎండు తెగులు రాకుండా కాపర్ ఆక్సిక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొక్కల మొదళ్లలో పోయాలన్నారు. ఆకుమచ్చ, బూజు తెగులు నివారణకు కార్బెండిజం 1 గ్రాము లేదా, మాంకోజెబ్ 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆయిల్ పామ్ తోటల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంటే మొవ్వ కుళ్లు ఆశించే అవకాశం ఉంటుందన్నారు. దాని నివారణకు కార్బెండిజం 1 గ్రాము లీటరు నీటిలో కలిపి మందు ద్రావణంతో మొవ్వ భాగం తడిచేలా పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి ఆర్.అరవింద్‌సాయి, గ్రామ ఉద్యాన వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

## వ్యాధుల కాలం.. జాగ్రత్త అవసరం



సీతానగరంలో డ్రైనేజీని శుభ్రపర్చుతున్న సిబ్బంది (ఫైల్)

**సీతానగరం:** నిల్వ, కల్తీ ఆహారంతో అనేక అనర్థాలు కలుగుతున్నాయి. వీటిని తీసుకోవద్దని వైద్య సిబ్బంది ఎంతగా చెబుతున్నా కొందరు వినడం లేదు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు చర్యలు తీసుకుంటున్నా, ప్రజలకు అవగాహన కలగడం లేదు. ఇటీవల సీతానగరంలో డయేరియా లక్షణాలతో 16 మంది అనారోగ్యం పాలయ్యారు. వారిలో ఇద్దరు మృతి చెందారు. వీరికి వాంతులు, విరోచనాలు కావడానికి నిల్వ చేపలు తినడమే కారణమని తెలుస్తోంది.

**పారిశుధ్య చర్యలు**

డయేరియా లక్షణాలతో పలువురు ఆస్పత్రిలో చేరడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. వెంటనే తగిన చర్యలు ప్రారంభించింది. పంచాయతీ అధికారులు అప్రమత్తమై డ్రైనేజీలో చెత్త చెదారం తొలగించి, రోడ్డులను శుభ్రపర్చారు. పంచాయతీ వాటర్ ట్యాంక్‌ను శుభ్రపరిచారు. డీపీవో, పీఎల్‌పీవో, డీఎంహెచ్‌వోలు సీతానగరంలో పర్యటించారు. ప్రజలకు వాటర్ ట్యాంకర్ నుంచి తాగునీటిని సరఫరా చేశారు. అలాగే ఈ నెల 5న కలెక్టర్ పి.ప్రశాంతి సీతానరగంలో పర్యటించి పారిశుధ్యాన్ని పరిశీలించారు. పరిస్థితి అధ్వానంగా ఉందంటూ ఇన్‌చార్జి పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. మాంసం, చేపలు దుకాణాలతో పాటుగా హోటళ్లు, స్వీట్‌స్టాళ్లు, టీ దుకాణాలను మూయించారు. వైద్య, ఆరోగ్యశాఖ అధికారుల పర్యవేక్షణలో నాలుగు బృందాలు ఇంటింటి సర్వే నిర్వహించాయి.

**నిల్వ చేపలే కారణమా..**

ఆటోపై చేపలను తీసుకువచ్చి కిలో రూ.50 చొప్పున గ్రామంలో విక్రయించారు. వాటిని కొనుగోలు చేసి వండుకు తిన్నవారితో పాటు, కర్రీ పాయింట్ వద్ద కూరలు తిన్నవారికి ఆ రోజు ఫుడ్ పాయిజన్ అయ్యింది. దీంతో వాంతులు, విరేచనాలతో ఆస్పత్రిలో చేరారు. ఆటోపై తీసుకువచ్చిన చేపలను తినడం వల్లే అనారోగ్యం వచ్చిందని వైద్యులు అభిప్రాయపడుతున్నారు. డయేరియా లక్షణాలతో ఆసుపత్రుల్లో చికిత్స పొందిన 14 మంది ఇళ్లకు చేరుకున్నారు. ఈనెల 10 న కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ బేదంపూడి జగన్నాథం, 14న ఇంటి వద్ద చికిత్స పొందుతూ పెంటా సుబ్బారావు మృతి చెందారు. వీరు డయేరియా లక్షణాల నుంచి బయట పడినా, మూత్రపిండాలు పనిచేయకపోవడంతో పాటు పలు ఆరోగ్య సమస్యలతో మరణించారని వైద్యులు నిర్ధారణ చేశారు. కొందరు ఆసుపత్రిలో చేరకుండా ఇంటి వద్దే ఆర్ఎంపీలతో చికిత్స తీసుకున్నారు.

# టేబుల్ టెన్నిస్‌లో పతకాల హోరు

- స్టేట్ చాంపియన్ షిప్‌లో నగర క్రీడాకారుల సత్తా
- పలు విభాగాల్లో విజయ కేతనం




రాష్ట్ర స్థాయి పోటీలో పతకాలు సాధించిన క్రీడాకారులు

**ప్రకాశం నగర్:** క్రీడలపై విద్యార్థులకు ఆసక్తి పెరుగుతోంది. చదువుతో పాటు ఆటలకూ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. తమకు ఇష్టమైన క్రీడలో ప్రావీణ్యం సాధించడంతో పాటు వివిధ పోటీలలో సత్తా చాటుతున్నారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ పతకాలు సాధిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇటీవల రాజమహేంద్రవరంలో జరిగిన ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్‌లో నగరానికి చెందిన పలువురు క్రీడాకారులు తమ సత్తాను చాటి పతకాలు సాధించారు. జి.సిరి పావని అండర్ - 17 విభాగంలో ప్రథమ, అండర్ - 19 విభాగంలో తృతీయ స్థానం సాధించింది. టి.ప్రభాత్ సాయి అండర్ - 19 బాలుర విభాగంలో ద్వితీయ స్థానం, మహిళల విభాగంలో వైష్ణవి సూర్య ద్వితీయ, చార్విఫాల్గున్ తృతీయ స్థానాలలో నిలిచారు. మోహిత్ శ్రీ అండర్ -11 బాలుర విభాగంలో తృతీయ స్థానంలో నిలిచాడు.

**జాతీయ పోటీలకు ఎంపిక**

ఏపీ స్టేట్ ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ చాంపియన్‌షిప్ టోర్నమెంట్‌లో రాష్ట్రంలోని వివిధ నగరాల నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు పోటీ పడ్డారు. సుమారు మూడు రోజులు పాటు జరిగిన పోటీలను పది టేబుళ్లపై 25 మంది ఎంపైరింగ్ సిబ్బందితో నిర్వహించారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు పతకాలు అందజేశారు. క్రీడాకారులు సాధించిన పాయింట్ల ఆధారంగా వారికి ర్యాంక్‌లు ఇచ్చి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారు.

**అభినందనలు**

రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్‌లో పతకాలు సాధించిన గౌతమి టేబుల్ టెన్నిస్ క్రీడాకారులను జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు విశ్వనాథం భాస్కరరామ్, అధ్యక్షుడు జేవీవీ అప్పారెడ్డి, కోశాధికారి కె.సత్యనారాయణ, కోచ్ వీటీవీ సుబ్బారావు అభినందించారు. జాతీయ స్థాయిలో పతకాలు సాధించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని ఆకాంక్షించారు.

### ఆనందంగా ఉంది



అండర్ - 17 బాలికల విభాగంలో మొదటి స్థానం, అండర్ –19 విభాగంలో తృతీయ స్థానం సాధించడం ఆనందంగా ఉంది. గౌతమి టేబుల్ టెన్నిస్ అసోసియేషన్‌లో శిక్షకుడు వీటీవీ సుబ్బారావు మంచి శిక్షణ ఇస్తున్నారు. భవిష్యత్‌లో మరిన్ని విజయలు సాధించి, జాతీయ స్థాయిలో రాణించడమే నా ధ్యేయం.

– జి.సిరి పావని

### తండ్రి ప్రోద్బలం



మా తండ్రి తీగిరెడ్డి బాపిరాజు ప్రోద్బలంతో టేబుల్ టెన్నిస్‌లో అడుగు పెట్టాను. ఎనిమిదేళ్ల వయసు నుంచీ జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలలో పాల్గొని పలు పతకాలు సాధించాను. ఆటతో పాటు చదువుకూ ప్రాధాన్యం ఇస్తున్నాను. అండర్ – 19 విభాగంలో ద్వితీయ స్థానం సాధించడం ఆనందంగా ఉంది.

– టి. ప్రభాత్ సాయి

## ఉత్సాహంగా.. ప్రశాంతంగా..

**రాజమహేంద్రవరం సిటీ:** ది ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పాలక మండలి ఎన్నికలు శనివారం ఉత్సాహంగా జరిగాయి. ఓటర్లు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కందుకూరి వీరేశలింగం విద్యాసంస్థల ఆవరణలో 48 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. చైర్మన్ అభ్యర్థులుగా నందెపు శ్రీనివాస్, చల్లా శంకరరావు తమన ప్యానళ్ల సభ్యులతో కలిసి పోటీ పడుతున్నారు. ఆదివారం కౌంటింగ్ జరుగుతుంది.



ఆర్యాపురం బ్యాంక్ ఎన్నికల్లో ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు



పోలింగ్ కేంద్రం వద్ద వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, డాక్టర్ గూడూరి శ్రీనివాస్



పోలింగ్ కేంద్రం వద్ద మేడపాటి షర్మిలారెడ్డి తదితరులు



పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న జక్కంపూడి గణేష్, శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం



ఓటు హక్కు వినియోగించుకుని వస్తున్న బ్యాంక్ మాజీ చైర్మన్ గిరజాల తులసి, బాబు

### వేంకటేశ్వరునికి పంచామృతాభిషేకాలు

**పెదపూడి:** మండలంలోని సంపర గ్రామంలో నిత్యం భక్తులతో పూజలందుకుంటున్న ప్రాచీన వేంకటేశ్వస్వామి ఆలయంలో ఆషాఢ మాసం చతుర్దశి శనివారం స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు స్వామిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు.

### ముంపుబారిన శ్రీరంగపట్నం

**మధురపూడి:** కోరుకొండ మండలం శ్రీరంగపట్నం ముంపు బారిన పడింది. గ్రామానికి ఆనుకున్న ఉన్న బురద కాలువకు శనివారం నీటి ఉధృతి పెరిగింది. దీంతో గ్రామంలోకి నీరు ప్రవేశించింది. రాత్రికి మరింత పెరిగే అవకాశం ఉండడంతో లోతట్టు ప్రాంతాల వాసులు భయాందోళనకు గురవుతున్నారు. సర్పంచ్ మద్దాల పెద్ద అమ్మాజీ, తహసీల్దార్ రాజ్యలక్ష్మి, ఎమ్మెల్యే సతీమణి బత్తుల వెంకటలక్ష్మి లోతట్టు ప్రాంతాలలో పర్యటించారు. వరద బాధితులకు హైస్కూల్ భవనంలో పునరావాసం ఏర్పాటు చేశారు. కాగా.. గంగవరం మండలం సూరంపాలెం ప్రాజెక్టు నుంచి అదనపు నీటిని విడిచిపెడితే బురద కాలువకు మరింత నీటి ఉధృతి పెరుగుతుంది.